ప్రజాశక్తి

బుధవారం 18 సెప్టెంబర్ 2024

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

నెల్లూరు :జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ 2.0 పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రధాని ఒడిశా రాజధాని భువనేశ్వర్ లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిర్మించిన గృహాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కార్యక్రమం కింద నిర్మించిన 2వేల 573 గృహాలను పూర్తి చేసి ఈరోజు లబ్ధిదారులకు అప్పగించినట్లు తెలిపారు. జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కార్యక్రమం కింద 11 మండలాలలో 60 మంది లబ్ధిదారులకు గృహాలు మంజూరు చేసినట్లు తెలిపారు. గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ దయాకర్,టిడ్ కో ఎస్. ఇ జాన్ సైమన్ , కావలి గృహ నిర్మాణ శాఖ ఇ. ఇ మాధవ రావు,డి.ఇ.ఇ డి. వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు మాధవయ్య, రామారావు, మహేష్ ఉన్నారు.



కాలువలు కనిపించడం లేదు..!

బడాబాబుల దురాక్రమణలు - వర్షమొస్తే విజయవాడ పరిస్థితులే ..

నెల్లూరు నగరంలో ఎన్నో దశాబ్దాలు కనిపించిన వరద, పంట, ఇరిగేషన్ కాలువ కనిపించడం లేదు..బడాబాబుల దురాక్రమణలకు అధికారులు, రాజకీయ నేతలు ప్రోత్సాహాలు ఇవ్వడంతో అడ్డూ అదుపు లేకుండా మాయం చేశారు. వరద వచ్చినా, వర్షం వచ్చినా సజావుగా సాగిపోయేలా కాలువల నిర్మాణం ఒకప్పుడు ఉండేది. కాల క్రమంలో పంట పొలాల స్థానంలో రియల్ ఎస్టేట్ రావడంతో అదే అదునుగా భావించిన కొందరు వ్యక్తులు దురాక్రమణలు చేశారు. 2015లో నెల్లూరులో వచ్చిన భారీ వర్షాలు, వరదలకు పరిస్థితి ఒక్కసారి బయట పడింది. అప్పటి సిఎం చంద్రబాబు నాయుడు కాలువలు కనిపెడుతానని చెప్పినా రాజకీయ కారణాలతో జరగలేదు. మళ్లీ వర్షం, వరదలు వస్తే విజయవాడ పరిస్థితులు నెల్లూరులో వచ్చినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు..



ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు నగరంలోని బడా పెద్దలు ఇరిగేషన్ కాలువను మింగేశారు. పంట కాలువలు కనిపించకుండా చేశారు.. ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న నెల్లూరు నగరంతోపాటు చుట్టుపక్కల పంట పొలాలు అధికంగా ఉండేవి. 30 సంవత్సరాల క్రితం పంట కాలువలు, ఇరిగేషన్ కాలువలు కపిపించేవి. వర్షాలు వచ్చినప్పడు, నెల్లూరు చెరువు నిండి వరద వచ్చినప్పుడు సజావుగా నీరు దిగువకు వెళ్లేవి. నీరు సజావుగా కిందకు వెళితే కాలువలు, నదిలో కలిసి, సముద్రానికి వెళ్లేవి. పంట పొలాల స్థానంలో రియల్ ఎస్టేట్ జరగడంతో పెద్ద ఎత్తున ఇంటి నిర్మాణాలు సాగాయి. పంట కాలువలు వదిలేసి రియల్ ఎస్టేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ ఆ పరిస్థితులు కనిపించ లేదు. నెల్లూరు చెరువులు పూర్తిగా నిండితే కలుజు నుంచి కిందకు నీరు ప్రవహిస్తుంది. పాత సుందర్ మహల్, వినాయక థియేటర్, నర్తకి, కనకమహల్ ప్రాంతాల మీదుగా కాలువ కిందకు వెళుతుంది. అక్కడ నుంచి సర్వేపల్లి కాలువలో కలవాల్సి ఉంటుంది. పెద్ద బజార్, బారకాసు సెంటర్, పాత జెడ్పి, బిఎస్ఎన్ఎల్ కార్యాలయాల మీదుగా మరో కాలువ వస్తుంది. పాత కోర్టు, చేపలమార్కెట్ మీదుగా మరో కాలువ ఇలా నగరంలో తొమ్మిది కాలువలు వెళుతుంటాయి. నిరుపేదల జానడు స్థలం లేక ఎక్కడైనా కట్టలపై ఇంటి నిర్మాణాలుంటే ఇరిగేషన్ చట్టాలు అధికారులకు గుర్తుకొస్తాయి. నెల్లూరు నగరంలోని కొన్ని హోటళ్లు , బంగారు దుకాణాలు, పెద్ద అపార్ట్‌మెంట్‌లు ఇరిగేషన్ కాలువలు ఆక్రమించి నిర్మాణాలు పూర్తి చేశారు. అప్పుడప్పుడు అధికారులు కాలువలు బయట తీస్తామని ప్రకటించినప్పుడల్లా రాజకీయ నేతలు జోక్యం చేసుకుంటుండడంతో ఎక్కడికక్కడే నిలిచిపోతుంటాయి. అందుకే నగరంలో ఒక్క గంట వర్షం పడితే కాలువ లేక, రోడ్ల మీదకు నీరు వస్తుంది. నగర ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.. పరిస్థితి ఇలానే ఉంటే మరో విజయవాడగా మారుతుందనే ఆందోళనలు నెలకొంటున్నాయి..

2015 నగరం మునిగిపోయింది..!

2015లో భార్గీలు రావడంతో వర్షపు నీటితో నెల్లూరు చెరువులు పూర్తిగా నిండిపోయాయి.. కలుజు నుంచి భారీగా వర్షపు నీరు నెల్లూరు నగరంపై పడింది. మన్సూర్ నగర్, చిన్న బజార్, పెద్ద బజార్, గాంధీబొమ్మ, మద్రాసు బస్టాండ్ ఒక్కటేమిటి దాదాపు నెల్లూరు నగరం సగం మునిగిపోయింది..అప్పటి ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు మూడు రోజులు నెల్లూరులోనే మకాం వేశారు. రాష్ట్రంలోని 30 మంది ఐఎస్ అధికారులు, మూడు వేల మంది రెవెన్యూ అధికారులు నెల్లూరులో పర్యటించారు.

నెల్లూరులో భారీ వరదలకు కారణం కాలువలు దురాక్రమణలు చేయడంగా గుర్తించారు. మంత్రి పి.నారాయణ ఆధ్వర్యంలో మార్కింగ్ చేశారు. త్వరలో కాలువలను ఆక్రమించి భవనాలు కూల్చివేస్తామని ప్రకటించారు. ఏం జరిగిందో తెలీదు. అప్పటి నుంచి ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. ఇది జరిగిన తరువాత ఆక్రమణలు మరింత ఎక్కువయ్యాయి. కొందరు రాజకీయ నేతలు, బడా బాబులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కాలువను దర్జాగా ఆక్రమించి అనుభవిస్తున్నారు.

స్పందించకుంటే పెను ప్రమాదం..!

నెల్లూరు నగరంలోని ఇరిగేషన్ కాలువలు ఆక్రమించి భారీ భవనాలు నిర్మించిన వ్యక్తులు, మరింత దురాక్రమణల చేస్తున్నారు. కొందరు కాలువలు కనిపించకుండా చేశారు. శివం హోటల్ మీదుగా వెళుతోన్న కాలువను బిఎస్ఎన్ఎల్ ఆఫీసు వద్ద కనిపించకుండా చేశారు. ఇలాంటి పరిస్థితి నగరమంతా కనిపిస్తోంది. ఎప్పుడో ఏడాదికి ఒకసారి వచ్చే వరదలప్పుడు చూసుకుందాం అనుకున్నా, మనకెందుకు అని భావించినా భావి తరాలకు పెను ప్రమాదంగా మారనుంది. సజావుగా వెళ్లాల్సిన నీటికి అడ్డకులు సృష్టిస్తే నగరం మీద పడి జనజీవితాలను అతలా కుతలం చేస్తుందనడానికి విజయవాడ ఉదాహరణగా కనిపి స్తోంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పంట కాలువలకు మరమ్మతులు చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు. గతంలో చంద్రబాబునాయుడు, నారాయణ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు..





ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి - లింగసముద్రం :ఉపాధ్యాయులుగా విధుల్లో చేరినప్పటి నుంచి అంకితభావంతో పనిచేసి క్రమశిక్షణ కలిగిన విద్యార్థులను తయారుచేసి వారి భవిష్యత్తుకు బాటలు వేసేలా విద్యాబోధన అందించాలని విశ్వనాథపురం సర్పంచ్ బొలినేని నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలం లోని విశ్వనాథపురం ప్రాథమిక పాఠశాలలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు సన్మానం జరిగింది. సర్పంచ్ మాట్లాడుతూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా జి విజయ్ కుమార్ ఎంపిక కావడం అభినం దనీయమని అన్నారు. ఉపాధ్యాయ వత్తిలో చేరినప్పటి నుండి విజయ్ కుమార్ వత్తి పట్ల అంకితభావంతో పనిచేస్తూ ఎంతోమంది ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దారని అన్నారు.ఆయన పనితీరుకు నిదర్శనమే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు రావడం అన్నారు.గతంలో పనిచేసిన పాఠశాలలో కూడా విజయ్ కుమార్ మంచి పేరు తెచ్చుకొని గ్రామస్తులు,విద్యార్థులు తల్లిదండ్రులు అభిమానాన్ని పొందారన్నారు. అనంతరం విజయ్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావు,గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉన్నం రమేష్, ఉపాధ్యాయులు ఉన్నారు.

గణేష్ లడ్డు @ రూ. లక్ష

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు రాళ్ల వీధజలోని శ్రీ మద్విరాట్ వీర బ్రహ్మేంద్ర స్వామి గుడిలో కందుకూరు విశ్వ బ్రాహ్మణ సంఘం వారు నిర్వ హిస్తున్న వర సిద్ధి వినాయక 47వ నవరాత్రులు ఉత్సవాల సందర్భంగా 11వ రోజు మంగళవారం లడ్డు వేలం పాట నిర్వహించారు. ఆ లడ్డు రూ. లక్ష పలికింది.కందుకూరు విశ్వబ్రాహ్మణ అధ్యక్షులు వడ్ల మాని శేఖర్ ఈ వేలంపాటలో లడ్డును దక్కించుకున్నారు.

జిల్లాను 'స్వచ్ఛత' వైపు నడిపిద్దాం..

కలెక్టర్ ఆనంద్

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లాను స్వచ్ఛత వైపు నడిపించేందుకు ప్రజలందరూ స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని జాయింట్ కలెక్టర్ కె కార్తీక్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని విఆర్‌సి మైదానంలో స్వచ్ఛత హి సేవ ర్యాలీని జాయింట్ కలెక్టర్ కార్తీక్, మున్సిపల్ కమిషనర్ సూర్య తేజ, జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ ప్రారంభించారు. విద్యార్థులనుద్దేశించి జేసి మాట్లాడుతూ జిల్లాలో నేటి నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత హిసేవ 2024 కార్యక్రమంలో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహిం చనున్నట్లు చెప్పారు. ప్రజలను చైతన్యపరిచేలా నగరంలో సాగిన ర్యాలీ విఆర్‌సి నుంచి గాంధీబొమ్మ కూడలి వరకు కొనసాగి తిరిగి విఆర్‌సి మైదానం చేరుకుంది. గాంధీ బొమ్మ సెంటర్లో మహాత్మా గాంధీ విగ్రహానికి జాయింట్ కలెక్టర్, కమిషనర్, జడ్పీ చైర్ పర్సన్, అధికారులు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. జెసి కె కార్తీక్ మాట్లాడుతూ దేశంలో స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా స్వచ్ఛత హి సేవ పేరుతో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



ర్యాలీలో జెడ్‌పి చైర్‌పర్సన్ అరుణమ్మ, తదితరులు

నగర కార్పొరేషన్ పరిధిలో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేస్తే ఇక నుంచి జరిమానాలు విధిస్తామని కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. నెల్లూరు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలందరూ తమ వంతు కషి చేయాలన్నారు. ప్రజలందరికీ కూడా స్వచ్ఛత హి సేవ కార్యక్రమాల పట్ల పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి స్వచ్ఛ నెల్లూరుగా తీర్చిదిద్దేందుకు కషి చేస్తామన్నారు. ర్యాలీలో జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, జడ్పీ సిఇవో కన్నమ నాయుడు, డిఆర్‌డిఆర్, మెప్మా పీడీలు సాంబశివారెడ్డి, రవీంద్ర, డిఎం అండ్‌హెచ్‌వో పెంచలయ్య, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చైతన్య, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు శాఖవరపు వేణుగోపాల్, రసూల్ ఉన్నారు.

సంక్షేమ పథకాల సాధనకు పోరాటం

భవన నిర్మాణ కార్మిక సంఘం

ప్రజాశక్తి-నెల్లూరు :అన్ని రంగాల కార్మికులను కలిసి చైతన్య పరిచి ప్రభుత్వంతో పోరాటం చేసి సంక్షేమ పథకాలను సాధించుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.వి.నరసింహరావు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఖాన్‌బాషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఆర్.వి. నరసిం హరావు మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన ఆలిండియా కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సభ్యులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళ కార్మికుల ఎదురు కొంటున్న ఇబ్బందులు, అవమానకర మైన వేదింపులు, తదితర మహిళ సమస్యలపై వారితో మాట్లాడి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్మికులు సమాజంలో ఎటువంటి పరిస్థితుల్లో ఉన్నారో ఒక్కసారి ఆలోచన చేయాలని, ఒక్క భవన నిర్మాణ రంగంలోనే కాకుండా ఇతర రంగా ల్లో పనిచేస్తున్న కార్మికుల జీవన స్థితి గతులను ఒక్కసారి పరిశీలించాలన్నారు. ఆర్ .శ్రీని వాసులు అవుల పెంచాలయ్య .ఎస్ కె ఖాళీల్. పి హరి కె సంపూర్ణమ్మ మందా.మహేష్. పి సూర్యనారాయణ పాల్గొన్నారు



మాట్లాడుతున్న నాయకులు

జనసేన కార్యాలయంలో సంబరాలు

నెల్లూరు :గ్రామసభల నిర్వహణలో పూర్తి సీఎం పవన్ కళ్యాణ్ ప్రపంచ రికార్డు సాధించడం హర్షనీయమని జనసేన పార్టీ సీనియర్ నేత నూనె మల్లికార్జున యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గోమతి నగర్ లోని జిల్లా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతోమాట్లాడారు. గునుకుల కిషోర్,చంద్రశేఖర్ రెడ్డి,కష్ణారెడ్డి, రవి,జమీర్, గుడి హరిరెడ్డి,నాగరత్నం,గుర్రం కిషోర్,శ్రీపతి రాము ఉన్నారు.

రక్తదానం చేసిన ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల లో పనిచేసే పొందూరి మురళీకృష్ణ అనే టీచర్ యుటియఫ్ నాయకుడు. ఆయన మంగళవారం ఒంగోలు అమత హార్ట్ ఆసుపత్రిలో గుండె సంబంధిత ఆపరేషన్‌కి అవసరం అయిన రోగికి రక్త దానం చేశాడు. స క్షమ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటరామాంజనేయులు మురళీకృష్ణను అభినందించారు.

ఓజోన్ పొరను పరిరక్షించుకోవాలి

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఓజోన్ దినోత్సవం జరుపుకోవడం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి విద్యార్థులకు ఓజోన్ పొరను పరిరక్షించాల్సిన అవసరం గురించి వివరించారు. పలువురు అధ్యాపకులు మాట్లాడారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని ఓజోన్ పొర క్షీణత మీద అవగాహన కల్పించారు. కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎన్. తిరుపతి స్వామి, డాక్టర్ కె వి పద్మావతి, కే కరుణ కుమార్, జి బ్రహ్మయ్య, కే నరేష్ రాజా, డాక్టర్ కే సుజాత, జి నరసింహారావు ఉన్నారు.

22న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - ముత్తుకూరు :ఈనెల 22వ తేదీ ముత్తుకూరులో ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు జరిగే బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఆర్కట్ పాలెం గ్రామాలలో ఇంటింటికి తిరిగి కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ సాధన కోసం ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ముత్తుకూరులోని ఆదాల నగర్ రామలింగాపురం జగన్ కాలేజీలో కంటైనర్ టెర్మినల్ సాధన కోసం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గోగుల శ్రీనివాసులు, గడ్డం అంకయ్య, నక్క రాధయ్య, పెద్దపూడి వెంకయ్య, దుంపల ఏడుకొండలు, దాసరి అంకయ్య, మన్నే పద్మమ్మ పాల్గొన్నారు.



భోజన కార్మికురాలు

పల్లవి తొలగింపు అక్రమం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :మధ్యాహ్నం భోజన పథకం కార్మికురాలు తాడి పల్లవిని విధుల నుంచి తొలగించడం అక్రమం ఇది నేరపూరిత చర్య అని ఎపి ఎండిఎం కార్మిక యూనియన్ జిల్లా కార్యదర్శి రెహనా బేగం విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండలంలోని ఇస్కపాలెం పాఠశాల భోజన కార్మికురాలు తాడి పల్లవిని తొలగించిన విషయం తెలిసిందే. భోజన పథకం విధుల నుంచి పల్లవిని తొలగించడాన్ని యూనియన్ నాయకులు ఖండించారు. పల్లవి తొలగింపును నిరసిస్తూ టిపిగూడూరు ఎంఇఒ కార్యాలయం ఎదుట మంగళవారం సిఐటియు మండల కార్యదర్శి మారుబోయిన రాజా ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. రెహనా బేగం మాట్లాడుతూ బలవం తంగా భోజన కార్మికురాలిని తొలగించడం నేరపూరితమైన చర్య అవుతు ందన్నారు. కుటుంబంలో తమ్ముడు చనిపోయినా శవాన్ని కూడా ఇంట్లో పెట్టుకుని కూడా చిన్నారులకు తాడి పల్లవి వంట చేసి పెట్టిన విష యాన్ని గుర్తు చేశారు. తాడి పల్లవిని హెడ్మాస్టరు శ్రీనివాసు లు రెడ్డి ఎంఇఒ వేణుగోపాల్ రెడ్డి కూడా బలుక్కుని రా జకీయాలకు అమ్ముడుపోయి పదేపదే సంతకం చేయ మని బలవంతం చేయడాన్ని ఆమె తప్పు బట్టారు.ఎంఇఒ, స్కూల్ హెచ్ఎంలను వెంటనే సస్పెండ్ చేయాలని, భోజన కార్మికురాలు తాడి పల్లవిని తక్షణం పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.మధ్యాహ్నం భోజన కార్మికుల యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సీనమ్మ, రేవతి కార్మికులు పాల్గొన్నారు.



నులి పురుగుల నివారణకు మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి-నెల్లూరు :కొండాయపాళెంలోని నగర పాలక ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. టైలర్స్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ కె. ఐశ్వర్య రాజ్యలక్ష్మి చేతులు కడుక్కునే 8 రకాల విధానం చేసి చూపించారు. ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం,బయట తిరిగేటప్పుడు బూట్లు లేదా చెప్పులు ధరించడం, మరుగుదొడ్డి వాడిన తరువాత ఏదైనా తినక ముందు చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవడం తదితర మంచి అలవాట్లు అందరూ పాటించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం భాస్కర్ రావు మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు అల్బెం డజోల్ 400 మి గ్రా మాత్రలను పంపిణీ చేశారు.

ప్రజాశక్తి - లింగసముద్రం :జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం లింగసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రాథమిక,ఉన్నత పాఠశాలలో మొత్తం 6018 మంది పిల్లలకు గాను 5773 మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేవారు. గైరుహాజరైన వారికి ఈనెల 25న జరిగే మాప్ డే రోజు పంపిణీ చేస్తారని తెలిపారు. మండలంలో 96 శాతం పంపిణీ జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నెల్లూరులో..



గుడ్లూరులో..

గుడ్లూరు : ఒకటి నుంచి 19 ఏళ్లలోపు లోపు వారందరికీ నులిపురుగులు నివారణ మాత్రలు పంపిణీ మంగళవారం పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు నులు పురుగులు నివారణ మాత్రలు వై జె సిబ్బంది అందజేశారు.

అన్నం సరిగా పెట్టరు.. ఆకలేస్తుంది సార్..

ఉలవపాడులో ఎంఎల్ఎ 'ఇంటూరి'కి ఫిర్యాదు చేసిన హాస్టల్ విద్యార్థులు

ప్రజాశక్తి-కందుకూరు


ఉలవపాడులోని ప్రభుత్వ ఎస్‌సి బాలుర హాస్టల్లో విద్యార్థులు ఆకలితో మాడిపోతున్న దారుణ పరిస్థితి ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి వచ్చింది.స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం ఉలవపాడు వచ్చిన ఎంఎల్ఎను ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు ఒక్కసారిగా చుట్టుముట్టారు. తిండి, వసతులు సరిగా లేక అల్లాడిపోతున్నామని.. ఊబికి వస్తున్న కన్నీళ్లు దిగమింగుకుంటూ ఎంఎల్ఎతో తమ బాధ చెప్పుకున్నారు. వారు చెప్పేదంతా విన్నతర్వాత, అక్కడి నుంచి ఎంఎల్ఎ ఇంటూరి నేరుగా హాస్టల్లోకి వెళ్లి అణువణువు పరిశీలించారు. అక్కడ ఉండే వాచ్ మెన్, ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తూ తమను తిడుతూ కొడుతున్నారని విద్యార్థులు వాపోయారు. అంతా విన్న ఎంఎల్ఎ వాచ్ మెన్ ను పిలిచి సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. పిల్లలకు సరిగా ఎందుకు అన్నం పెట్టడం లేదు ? వారి చేత ఎందుకు పనులు చేయిస్తున్నారు ? ప్రశ్నించారు. పద్ధతి మార్చుకోండి, ఇంకోసారి పిల్లలను ఇబ్బంది పెట్టినట్లు తెలిస్తే ఊరుకునేది లేదు.. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి మిమ్మల్ని సస్పెండ్ చేయిస్తా ? అంటూ హెచ్చరించారు. హాస్టల్ ను ఎందుకు తనిఖీలు చేయడం లేదని మండల స్థాయి అధికారులను గట్టిగా ప్రశ్నించారు. హాస్టల్ వ్యవహారం త్వరలోనే గాడిలో పడేలా గట్టి చర్యలు తీసుకుంటానని విద్యార్థులతో ఎమ్మెల్యే చెప్పారు త్వరలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, హాస్టల్ కు నూతన భవనం నిర్మించేలా చేస్తానన్నారు.



స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన

లింగసముద్రం : స్వచ్ఛత హై సేవ సందర్భంగా మంగళవారం ర్యాలీ,ప్రతిజ్ఞ,మానవహారం నిర్వహించారుపరిసరాలు- పరిశుభ్రతపై లింగస ముద్రం కమ్మిశెట్టి రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండల పరిషత్ అభివద్ధి అధికారి కట్టా శ్రీనివాసులు, తాహశీల్దార్ సీతామహాలక్ష్మి, ఇఒపిఆర్‌డి రామ సుబ్బారావు, మండల విద్యాశాఖ అధికారి శివకుమార్, పాఠశాల హెచ్ఎం ఉమ్మడిశెట్టి మాధవరావు, లింగసముద్రం సర్పంచ్ పులి రాఘవులు పాల్గొన్నారు.

కందుకూరు :ఉలవపాడులో జరిగిన ర్యాలీ అనంతరం ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్యక్రమంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఇంటి చుట్టుపక్కల పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే, గ్రామం మొత్తం పరిశుభ్రంగా ఉంటుం దన్నారు. పారిశుద్ధంపై నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. ఎంపీడీవో విజయ, ఎంఈఓ శివనాగేశ్వరరావు, సర్పంచ్ నాగలక్ష్మి, కార్యదర్శి విజయమ్మ, సిడిపిఓ అరుణ, మండల టిడిపి అధ్యక్షులు రాచగల్లు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి సుదర్శి శ్రీను, ఉలవపాడు గ్రామ టిడిపి అధ్యక్షుడు అంచుపోగు వాసు, మండల టిడిపి మహిళా అధ్యక్షురాలు సన్నెబోయిన ప్రభావతి, మండల తెలుగు యువత అధ్యక్షుడు తొట్టెంపూడి మాల్యాద్రి ఉన్నారు.




ఉలవపాడులో..

చుక్కల భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి -గుడ్లూరు :మండలంలోని ద్వారకానిపాడు దగ్గర 321 ఎకరాలలో రైతులు సాగు చేసుకుంటున్న చుక్కల భూములకు పట్టాలు ఇప్పించాలని రాళ్లపాడు ఆయకట్టు పరిరక్షణ సమితి అధ్యక్షులు కాకుమాని మాధవరావు తహశీల్దార్ స్వర్ణకి మంగళవారం వినస పత్రం అందజేశారు. పొలాలు పరిశీలించి త్వరలో పరిష్కారం చూపిస్తామని తహశీల్దార్ స్వర్ణ హామీ ఇచ్చారు.

ఉపాధి పనులు చేపట్టాలని ఆందోళన

మనుబోలు :మనుబోలు మండలం, చెర్లోపల్లి సచివాలయం ఎదుట ఉపాధి పనులు చేపట్టాలని ఉపాధి కార్మికులు మంగళవారం ఆందోళన చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తలారి దేవదానం, ఎ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్‌లో నకిలీల బెడద

నగరంలో కేసు నమోదు

ప్రజాశక్తి-నెల్లూరు :మార్కెట్‌లో బ్రాండెండ్ వస్తువులు నకిలీ విక్రయాలు రోజు రోజుకు పెరుగు తున్నాయి. అన్ని పెద్ద కంపెనీలకు చెందిన కొన్ని విడి భాగాలు ఒరిజనల్‌గా విక్రయిస్తు న్నాయి. అదే స్థాయిలో నగదు వసూళ్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రెస్టీజ్ బ్రాండ్ పేరుతో నకిలీ సేఫ్టీ వాల్వ్‌లు, కుక్కర్ విజిల్స్‌ను విక్రయించినందుకు గాను మెసర్స్ శ్రీనివాస హోమ్ అప్లియెన్సెస్ పై టీటీకే ప్రెస్టీజ్ లిమిటెడ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మెసర్స్ శ్రీనివాస హోమ్ అప్లియెన్సెస్ నకిలీ సేఫ్టీ వాల్వ్‌లు, కుక్కర్ విజిల్స్ విక్రయానికి పాల్పడు తున్నారని, నగరంలోని నవాబుపేట పోలీస్ స్టేషన్‌లో ఈ ఫిర్యాదు నమోదైంది . మెసర్స్ శ్రీనివాస హోమ్ అప్లియెన్సెస్ నకిలీ సేఫ్టీ వాల్వ్‌లు, కుక్కర్ విజిల్స్ ను నెల్లూరు లోని వివిధ ప్రాంతాలలో విక్రయిస్తున్నట్లు తెలిసింది. మొత్తం 900 సేఫ్టీ వాల్వ్‌లు, 144 కుక్కర్ విజిల్స్‌ను ఈ సందర్భంగా స్వాధీనం చేసుకున్నారు. దుకాణాల్లో ప్రెస్టీజ్ అనే బ్రాండ్ పేరుతో ఉన్నట్లు గుర్తించారు.మెసర్స్ శ్రీనివాస హోమ్ అప్లియెన్సెస్ యజమాని కాలాజీ భరత్ కుమార్ నకిలీ సేఫ్టీ వాల్వ్‌లు, కుక్కర్ విజిల్‌ల విక్రయం, పంపిణీలో పాల్గొన్నట్లు శ్రీ మహ్మద్ షేక్ అన్వర్ బాషా తన పోలీసు అధికారుల బృందంతో కలిసి నిర్ధారించారు. 318(4) బిఎన్ఎస్, 1957 కాపీరైట్ చట్టం 63 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ."ప్రెస్టీజ్" బ్రాండ్ పేరు కలిగిన ఉత్పత్తులను కొనుగోలు చేసేటప్పుడు వినియోగదారులు జాగ్రత్త వహించాలని సంస్థ కోరింది.

పలువురు మంత్రులను కలిసిన గిరిధర్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు :విజయవాడలో పలువురు రాష్ట్ర మంత్రులను వారి క్యాంపు కార్యాలయాల్లో జిల్లా టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, ఇరిగేషన్ మంత్రి డాక్టరు నిమ్మల రామానాయుడు,రవాణా శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తదితరులను కలిసి జిల్లాకు చెందిన పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించాలని కోరారు.

చేతుల పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి -నెల్లూరు :నెల్లూరు చెన్నకేశవ నగర్ 25/4 సచివాలయం పరిధిలోని శేషు ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో మంగళవారం జరిగిన ఎన్‌డిడి ప్రోగ్రామ్‌లో విద్యార్థులకు నులిపురుగులకు, హ్యాండ్ వాష్ గురించి రక్తహీనతను గురించి సచివాలయలో పోలమ్మ ఆశ వర్కర్ అవగాహన కల్పించారు. శేషు ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ బి శేషు తదితరులు పాల్గొన్నారు.

20న సండే మార్కెట్ వార్షికోత్సవ సంబరాలు

ప్రజాశక్తి-నెల్లూరు :ఈ నెల 20న నగరంలోని టౌన్‌హాలులో సండేమార్కెట్ 40వ వార్షికోత్సవ సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆ మార్కెట్ కమిటీ గౌరవాధ్యక్షులు జె.కిషోర్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం నగరంలో సండే మార్కెట్ సమావేశ మందిరంలో మీడియా సమావేశం మాట్లాడారు. నెల్లూరు పట్టణ రోడ్డు మార్జిన్ వ్యాపారుల సంక్షేమ సంఘం, సండే మార్కెట్ కమిటీ కార్యదర్శి ఆర్.సెంథిల్ కుమార్, మాజీ కార్యదర్శి పి.శర్వణ ఉన్నారు.

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి-గుడ్లూరు : గర్భిణులు, బాలింతలు కిషోర్ బాలికలు నిరంతరం పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని తెట్టు సెక్టార్ పరిధిలోని మోచర్ల అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవం కార్యక్రమం సందర్భంగా సూపర్‌వైజర్ కామేశ్వరి సూచించారు. మంగళవారం జరిగిన స్థానిక అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు తల్లులు చిన్నారులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి-గుడ్లూరు :మండలంలోని దప్పలంపాడు దగ్గర ఉన్న మన్నేరు లో ఎలాంటి అనుమతులు లేకుండా రెండు ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తుండగా పోలీసులు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు ఉంటాయని ఎస్ఐవి వి వెంకట్రావు తెలిపారు

19 నుంచి విద్యుత్ ఉద్యోగులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి-నెల్లూరు :ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేది వరకు మూడు రోజుల పాటు విద్యుత్ శాఖలో (డిస్కామ్స్, ట్రాన్స్ కో,జెన్ కో)పనిచేస్తున్న ఉద్యోగులకు ఇంటర్ సర్కిల్ బ్యాడ్మింటన్ ,టెన్నిస్ క్రీడా పోటీలు నగరంలోని నెల్లూరు క్లబ్ నందు జరుగుతాయి అని విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ వి.విజయన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన వెల్లడించారు.

చెట్టు కొమ్మ పడి ఆర్‌టిసి డ్రైవర్ మృతి



ప్రజాశక్తి-కోవూరు : పుత్తూరు ఆర్‌టిసి డిపోకు చెందిన డ్రైవర్ నావూరు శ్రీరాములు చెట్టుకొమ్మ విరిగి ఆయన తలపైన పడడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పడుగుపాడు ఆర్‌టిసి వర్క్‌షాప్ దగ్గర చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే.. తిరుపతి జిల్లా నారాయణపురం మండల పరిధిలోని కృష్ణంరాజు కండ్రిగలో నివాసం ఉంటున్న శ్రీరాములు పుత్తూరు ఆర్‌టిసి డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన నడుపుతున్న బస్సుకు అద్దం పగలడంతో వర్క్‌షాప్ రిపేరు కోసం వచ్చాడు. ఆయన వెంటనే తిరిగి తిరుపతి వెళ్లి పోవాల్సింది. అదేసమయంలో తిరుపతి డిపోకు చెందిన బస్సు రావడంతో అందులో వెళ్లొచ్చని కొద్దిసేపు వర్క్‌షాప్ బయట ఉన్న చెట్టు కింద విశ్రాంతి కోసం పడుకొన్నాడు. శ్రీరాములు నిద్రపోతున్న సమయంలో చెట్టు కొమ్మ విరిగి శ్రీరాములు తలపై పడడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందారు. అయన వచ్చే ఏడాది ఉద్యోగ విరమణ పొందుతారు. వర్క్‌షాప్‌లో ఉన్న తోటి సిబ్బంది హుటాహుటిన వచ్చి 108కు ఫోన్ చేసిన ఫలితం లేకుండా పోయింది. విషయం తెలుసుకొన్న కోవూరు ఎస్‌ఐ రంగనాథ్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకొన్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్ట్ నిమిత్తం కోవూరు ప్రభుత్వ వైద్యశాలకు పంపించారు.



న్యాయం చేయండి సారూ..

- బాధితురాలు రుక్మిణమ్మ ఆవేదన

ప్రజాశక్తి-కావలి : కొండాపురం మండలం నేకునాంపేట గ్రామస్తురాలైన తనను సదరు గ్రామంలో నివాసులు నలగట్ల పావని, నలగట్ల కోటమ్మ, రొడ్డా శివశంకర్ కలిసి దాడి చేసి కొట్టి గాయపరిచారని, పోలీస్ రిపోర్ట్ ఇచ్చినా.. తనగోడు ఎవరూ పట్టించుకోలేదని రుక్మిణమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. మంగళవారం కావలి పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్‌లో ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తన గోడు వెళ్లబోసుకుంది. తనకు న్యాయం జరిపించాలని మీడియా మిత్రులను కోరింది. తనపై ఒక పథకం ప్రకారం పాత కక్షలను కడుపులో పెట్టుకుని నలగట్ల పవని, తన ఇంటి ముందుకు వచ్చేలా మురుగు నీటిని వదులుతూ ఉండగా, తాను పిలిచి అడిగానని, వెంటనే పవని, కోటమ్మ, శివశంకర్‌లు సెప్టెంబర్ 2వ తేదీ మధ్యాహ్నం తన ఇంటిమీదకు దాడి చేసి, కొట్టారని తెలిపింది. ఈ విషయమై తాను కొండాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, అయినా వారం రోజులపాటు ఎస్.ఐ. తన ఫిర్యాదును పట్టించుకోలేదని వాపోయింది. కావలి డిఎస్‌పికి, నెల్లూరు ఎస్.పి.కి కూడా ఫిర్యాదు చేశానని, ఇంతవరకు పోలీసులు పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు తనను కొట్టినా నిందితులు అధికార పార్టీ అండతో తనను బెదిరిస్తున్నారని, తనను చంపేస్తామంటున్నారని, రుక్మిణమ్మ ఆరోపించింది. వారి బారి నుండి తనకు రక్షణ కల్పించి, నిందితులను కఠినంగా శిక్షించాలని, తనకు న్యాయం జరిగేలా విలేకరులు అధికారుల దృష్టికి వచ్చేలా చేయాలని విజ్ఞప్తి చేసింది.

న్యాయవాదులకు స్ఫూర్తి పరమేశ్వరరావు

ప్రజాశక్తి-కావలి : సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది న్యాయశాస్త్ర కోవిదుడు పద్మభూషణ్ పవని పరమేశ్వరరావు న్యాయ వ్యవస్థకు వన్నె తెచ్చిన వ్యక్తి అని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వెంగళరావునగర్‌లో ప్రభుత్వ శాఖ గ్రంథాలయం ఆవరణలో పవని పరమేశ్వరరావు 7వ వర్థంతి సందర్భంగా మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. కార్యక్రమంలో సామాజిక వేత్త ఎం.మాలకొండారెడ్డి మాట్లాడుతూ యువ న్యాయవాదులు పి.పి.రావును స్ఫూర్తిగా తీసుకొని న్యాయవ్యవస్థకు వన్నెతేవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సునీత, విద్యావేత్తలు, దివ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్‌పొర రక్షణతోనే మానవ మనుగడ

ప్రజాశక్తి-ఉదయగిరి : ఓజోన్ పొర పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు సీనియర్ సైన్స్ టీచర్ డి.రమేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ ఓజోన్‌పొర పరిరక్షణ దినోత్సవ వేడుకలు మంగళవారం క్రిష్ణంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. అప్‌కాస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో రమేష్ ఓజోన్ పొర ప్రాధాన్యత - పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు గొడుగులు చేతపట్టుకొని ఓజోన్‌పొర భూగోళాన్ని ఎలా కాపాడుతుందో కళ్ళకు గట్టినట్లు ప్రదర్శించారు. తర్వాత మానవహారంగా ఏర్పాటై నినాదాలు చేస్తూ ఓజోన్‌పొరను కాపాడతామని ప్రతిన చేశారు. కార్యక్రమంలో సీనియర్ టీచర్లు షేక్ జరీనా, రెడ్డిచర్ల సుధాకర్, షేక్ ముజాఫర్ అలీ, పంచాయతీ కార్యదర్శి ఎస్.శిల్ప, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ ఇ.నరేంద్ర పాల్గొన్నారు.

ఎరువుల తయారీ కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి-మర్రిపాడు : సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్న ఖాదర్‌పూర్ యూనిట్‌ను మంగళవారం ఎస్‌డిఎ ఆశీర్వాదం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నచిన్న పంటలు సాగు చేస్తున్న అన్నదాతలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రకృతి వైపరీత్యం ఒకవైపు దళారులు మరోవైపు నస్టకారం రైతులను దోచుకుంటున్నారన్నారు. వ్యవసాయంలో భాగంగా ప్రకృతి వ్యవసాయంలో ఎటిఎం విధానం వ్యవసాయ అధికారులు ముందుకొచ్చారని తెలిపారు. తక్కువ పొలం ఉన్న రైతులకు మంచి అవకాశాలున్నాయి. రైతు ఉన్న 20సెంట్ల పొలంలో 20రకాల విత్తనాలు నాటి ప్రతిదినం ఆదాయం పొందవచ్చన్నారు. అదేవిధంగా ఎటిఎం అంటే ఏనీ టైం మనీ అని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంటి సురేష్, కిషోర్, ఖాదర్‌పూర్ ఐసీఆర్‌పి నవ్య, బ్రాహ్మణపల్లి ఎన్‌సీఆర్‌పి వెంకటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్లు వితరణ

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం నివాసులు పి.నారాయణ సహకారంతో సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో బుడంగుంట నక్కలోళ్ళ కాలనీలో మంగళవారం భోజన ప్యాకెట్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పేదలకు ఆకలి తీర్చిన దాత పి.నారాయణకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ ఉన్నామని తెలిపారు.

ఉర్దూ పాఠశాలల కాంప్లెక్స్ సమావేశం

ప్రజాశక్తి-ఉదయగిరి : అల్లూరి రామిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గం కాంప్లెక్స్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలు జిల్లా డిప్యూటీ ఉర్దూ ఇన్స్పెక్టర్ షేక్.ఖాజామొహిద్దీన్, ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు, పాఠశాల సముదాయ చైర్మన్ పి.వాలకొండయ్య ప్రారంభించారు. ఉదయగిరి పాఠశాల సముదాయంలోని సెక్షన్ ఫైజ్ అహ్మద్, రిసోర్స్ పర్సన్‌గా ఎస్ఏ ఎమ్‌డి కరీం, ఎస్ఏ షంషాద్ బేగం, ఎస్ఏ ఇనాయత్ కరీముల్లా పాల్గొన్నారు.

ప్రాథమిక దశలోనే క్యాన్సర్ నివారణ

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : మనిషిని జీవచ్ఛవంగా క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తిగా నివారించవచ్చని కొవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని 10వ తేదీ నుంచి ప్రారంభమైన వారం రోజుల పాటు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమానికి పింక్ బస్ బుధవారం నుంచి కొడవలూరు మండల కేంద్రంలో సేవలు అందించనుందని తెలిపారు. ప్రజలందరూ దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ట్రస్ట్ సేవలు అభినందనీయం



ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : విద్యార్థులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని సృజనాత్మక ఆవిష్కరణలతో సమాజహిత లక్ష్యంగా పనిచేస్తున్న సమర్థన ట్రస్ట్ సేవలు అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారులు ఎం.దిలీప్‌కుమార్, పి.వి.రత్నం అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలోని పెద్దూరు జెడ్‌పి బుజ్జమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం మిడ్‌సైజ్ ల్యాబ్ ప్రారంభం, దివ్యాంగులకు హెల్ప్ లైఫ్ ఆధ్వర్యంలో పోషకాహార సంచులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.సుజాత, జిల్లా రిసోర్స్ గ్రూప్‌సభ్యులు గండికోట సుధీర్ కుమార్, సమర్థన ట్రస్ట్ ప్రోగ్రామ్ మేనేజర్ లోకేష్‌కుమార్, సభ్యులు రంగారావు, హెల్ప్ లైఫ్‌మెంబర్ జగన్నాధం రావ్, భరత్, కవిత శ్రీధర్, రవి, సైన్స్ ఉపాధ్యాయులు, సహిత విద్య ఉపాధ్యాయులు శేషమ్మ, శ్రీనివాసులు రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ - ఉన్ - నబీ ఉత్సవాలు

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని చుంచులూరు గ్రామంలో మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని గ్రామంలో షేక్ ఖాజావలి ఆలియాస్ బోడే సాయిబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాజావలి దాతృత్వంతో గ్రామస్తులందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో గ్రామానికి చెందిన కలిశెట్టి రాజేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రపంచానికి మంచిని,మానవత్వాన్ని బోధించిన మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా మిలాదునబీ ఉత్సవాలను నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని ఖాజావలి సొంత నిధులతో ఈ ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. వీరు గ్రామంలో ఇలా సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ గ్రామానికి ఎంతగానో సేవ చేస్తున్నారన్నారు. గ్రామస్తులు ఖాజావలిని ఘనంగా సన్మానించారు.

22న సిఐటియు బహిరంగసభ

ప్రజాశక్తి-కావలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ సాధన కోసం సిఐటియు ఆధ్వర్యంలో 22న నెల్లూరులోని ముత్తుకూరు రోడ్డు వద్ద జరిగే బహిరంగసభ జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పసుపులేటి తిరుపాలు మాట్లాడుతూ దేశంలోనే అత్యంత సంపన్నుడైన అదాని, కృష్ణపట్నం పోర్టును కొనుగోలు చేసి, కంటైనర్ టెర్మినల్‌ను ఈ సంవత్సరం జనవరి నుండి మూసివేసి, ఇక్కడ కంటైనర్ ఎగుమతులు, దిగుమతులు తమిళనాడులోని తన సొంతపోర్టులో కాటుపల్లి ఎన్నూర్లకు తరలించుకు పోయాడని విమర్శించారు. ఇది జిల్లా స్థానిక ఉద్యోగ ఉపాధి అవకాశాలకు గండి కొట్టినట్లైందన్నారు. జిల్లా అభివృద్ధికి తలమానికమనే చెప్పుకున్న పోర్టు, నిరుపయోగంగా మారిందన్నారు. ఎక్కడపడితే అక్కడ గుట్టలు, గుట్టలుగా బొగ్గు ఐరన్ వోర్ దర్శనం ఇస్తుందన్నారు. ఈ గుట్టల వల్ల గాలి వీచిన ప్పుడల్లా దుమ్ము, ధూళి, వాన కురిస్తే, కలుషిత నీరు చుట్టుపక్కల గ్రామాలపై ఈ ప్రభావం పడుతుందన్నారు. దానివల్ల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని, పంటపొలాల దిగుబడులు తగ్గుతున్నాయన్నారు. బకింగ్ హోమ్ కెనాల్, కండలేరు కాలు వలన్నీ కలుషితమై, చేపలవేట దెబ్బతిని పోతుందన్నారు. మత్స్యకారులు తమ జీవనాధారం కోల్పోతున్నారన్నారు. పర్యావరణం నాశనమై పోతుందన్నారు. గతంలో యాజమాన్యం టెర్మినల్ మూసి వేసేది లేదని, లావాదేవీలు మాత్రమే తగ్గుతాయని చెప్పి, ఏకంగా ఈ సంవత్సరం సెప్టెంబర్ 1వ తేదీ నుండి కంటైనర్లను దించే క్రేన్లకు ఉన్న స్ప్రెడర్లను తొలగించి, బొగ్గును అన్లోడ్ చేసే గ్రాఫ్ బకెట్లను తగిలించారన్నారు. చెప్పిన మాటలకు, చేసే పనులకు, పొంతన లేకుండా పోయిందన్నారు. కేంద్ర పాలకుల అండ చూసుకొని అదానీ యాజమాన్యం చెలరేగిపోతుందన్నారు. ఒకవైపు ప్రభుత్వం, మరోవైపు ప్రజల కళ్ళు గప్పి, ఇదంతా చేస్తున్నారన్నారు. కంటైనర్ టెర్మినల్ సాధించుకునేందుకు 22న ఆదివారం సాయంత్రం 4గంటలకు ముత్తుకూరు బస్టాండ్ సెంటర్లో బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ బహిరంగ సభలో కార్మికులు ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వి.బాబురావు, కె.చెన్నయ్య, బి.కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



కత్తి పుల్లయ్య (ఫైల్)

మనోవేదనకు గురై ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలోని నువ్వురుపాడు పంచాయతీలోని జంగాలపల్లి ఎస్‌సి కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కత్తి పుల్లయ్య 2.5 ఎకరాల పొలం ఉంది. గత 40యేళ్లుగా పొలాన్ని సాగు చేసుకుంటూ ఉన్నాడు. ఈ పొలంకు సంబంధించిన అన్ని రికార్డులు అతనికి పుష్కలంగా ఉన్నాయి. అయితే రీసర్వే అంటూ రెవెన్యూ వారు ఒక రికార్డు తెచ్చారు. కొలత వేసేటప్పుడు నీకు రెండు ఎకరాలే ఉంది. మిగిలింది పక్కవారికి ఇవ్వాలంటూ అతనిపై ఒత్తిడి తెచ్చారు. అప్పటి నుంచి అధికారుల చుట్టూ తిరుగుతూ తమ గోడు వెల్లబోసుకున్నాడు. ఇటీవల కాలంలో నువ్వూరుపాడుకు వచ్చిన కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాడు. అధికారులు గ్రామంలో విఆర్‌ఒపై ఆధారపడ్డారని, విఆర్‌ఒ తీరు పుల్లయ్యకు వ్యతిరేకంగా ఉంది. ఫలితం అతనికి వేదన పెరిగింది. ఇటీవల తన పొలం వివాదంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. రెవెన్యూ అధికారులకు వినతి ఇచ్చాడు. మంగళవారం సర్వే అంటూ అతనికి సమాచారం ఇచ్చారు. పరోక్షంగా అతనికి వచ్చేది 2 ఎకరాలే అని మిగిలింది రాదు అంటూ మానసికంగా వేదనకు గురి చేశారు. ఫలితం మనోవేదనతో పుల్లయ్య బలవన్మరణం చెందారు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఉరి వేసుకున్నాడు. ఉరి వేసుకున్న పుల్లయ్యను గమనించి కుటుంబ సభ్యులు అతడిని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కత్తి పుల్లయ్య పొలం విషయంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గంటా లక్ష్మీపతి, ఎపి రైతుసంఘం మండల అధ్యక్షులు కృష్ణమోహన్ అనేకసార్లు అధికారులకు విన్నవించారు. అయినా ఫలితం లేకపోయింది. మంగళవారం కత్తి పుల్లయ్య ఇంటికి వెళ్లి ఆయన మృతదేహానికి నివాళులర్పించారు.



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సీతారాం ఏచూరికి నివాళులు

ప్రజాశక్తి-దగదర్తి

జక్కా వెంకయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారంవారం సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ఆధ్వర్యంలో నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు కార్యకర్తగా మొదలైన ఆయన జీవితం 50 సంవత్సరాలలో మూడుసార్లు సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారని తెలిపారు. ఎన్నో ప్రజాపోరాటాలను, ఉద్యమాలను ఆయన నిర్వహించారన్నారు. జవహర్లాల్ నెహ్రూ యూనివర్శిటీలో పీజీ పూర్తి చేసిన ఆయన జెఎన్‌యులో మూడుసార్లు ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షుడిగా ఎన్నికై, ఎస్‌ఎఫ్‌ఐ పునాదికి కీలకపాత్ర వహించారన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తుళ్లూరు గోపాల్, జిల్లా కమిటీ సభ్యులు గోనె దయాకర్, సభాధ్యక్షులు వంటేరు సుధాకర్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు రఘురామయ్య, శాఖా కార్యదర్శులు, నాయకులు గోపసాని రమేష్, చల్లా మాల్యాద్రి, పెరికల మాల్యాద్రి, గొల్లపల్లి వెంకటరమణయ్య, మందా మహేష్, పోతంశెట్టి విద్యాచరణ్, గిరి, క్రిష్టారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు రూరల్‌లో..

ప్రజాశక్తి-నెల్లూరు : కమ్యూనిస్టు యోధుడు, మార్క్సిస్టు మేధావి సీతారాం ఏచూరి సంస్మరణ సభను దేవరపాలెం ఐఎంఎల్ డిపోలో సిపిఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం నెల్లూరు రూరల్ మండల కార్యదర్శి ఆలూరు తిరుపాలు మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకొని పోవడమే నేడు మన ముందున్న కర్తవ్యమని అదే వారికి మనమిచ్చే ఘనమైన నివాళులు అని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పూడిపర్తి జనార్ధన్, ముత్యాల నాగయ్య, శ్రీపతి వెంకయ్య, మల్లే సింహగిరి, ఏగోలు భాస్కర్, మావిళ్ల మనోజ్, శివకుమార్, సాంబయ్య, గడ్డం కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేట్ సంస్థలకు
వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట



నిరసన చేపడుతున్న సిఐటియు నాయకులు

డ్రైవింగ్ టెస్టు వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలను ప్రయివేటు సంస్థలకు అప్పగించడం సరికాదని జిల్లా సిఐటియు అధ్యక్షులు టివివి ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆటో కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న మోటారు వాహన చట్టంతో రాష్ట్రంలో ఉండే ఆర్‌టిఒ కార్యాలయాలు నిర్వీర్యం అయ్యే ప్రమాదాముందని టివివి ప్రసాద్ పేర్కొన్నారు. డ్రైవింగ్ టెస్టులు, వాహనాల ఫిట్‌నెస్ టెస్టులను ప్రయివేటు సంస్థలకు అప్పగించడం చాలా బాధాకరమన్నారు. ప్రయివేటు సంస్థలు ఏర్పాటు చేస్తున్న సెన్సార్ ఫిట్‌నెస్ ట్రాక్‌లను వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ఈ చట్టల ద్వారా ఆటో కార్మికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదముందని తెలిపారు. సెప్టెంబర్ 24వ తేదీ నెల్లూరు ఆర్‌టిఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షులు మారుబోయిన రాజ, సిపిఎం మండల కార్యదర్శి మైపాటి కోటేశ్వరరావు, సిఐటియు మండల కార్యదర్శి ఎస్‌కె చాన్‌బాషా, దయాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

పాముకాటు బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-కావలి



ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్.మల్లి

కోవూరుపల్లిలో పాముకాటు బాధితులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎఎన్ఎంపై చర్యలు తీసుకొని, బాధిత కుటుంబ సభ్యులను ఆదుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కావలి ఆర్‌డిఒ వి.కె.శీనానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సెప్టెంబర్ 2న బొచ్చు శంకర య్య పాముకాటుకు గురయ్యాడన్నారు. అతడిని వైద్య కోసం కోవూరుపల్లి పిహెచ్‌సి కేంద్రానికి తరలించారని తెలిపారు. అక్కడ ఉన్న ఎఎన్ఎం పూర్తిగా నిర్లక్ష్యంగా వహించిందని తెలిపారు. ఒకటిన్నర గంటసేపు తలుపులు తీయకుండా బాధ్యతా రహితంగా వ్యవహరించారన్నారు. దానితోనే శంకరయ్య మృతి చెందారని తెలిపారు. తక్షణమే ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుడు బంధువులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-ఉదయగిరి

ఉదయగిరి పట్టణంలోని గాజులువీధిలో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. వింజమూరుకు చెందిన సయ్యద్ షరీఫ్ (26) తోట విస్తిరాణి ఎస్‌టి (23) ప్రేమ వివాహం చేసుకొన్నారు. గత నెల క్రితం ఉదయగిరిలోని గాజుల వీధులోని అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. వీరిద్దరికి రెండు నెలల పాప కూడా ఉంది. కుటుంబ కలహాల కారణంగా విస్తీరాణి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భర్త తలుపు తీయాలని పిలిచిన పలకకపోవడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ కె.శ్రీనివాసులు సిబ్బందితో కలిసి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నవోదయకు గడువు పొడిగింపు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశం కోసం నిర్వహించే పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు సెప్టెంబర్ 23వ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 16తో దరఖాస్తు గడువు ముగియనుండగా ఎక్కువమంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సమితి ఈ నిర్ణయం తీసుకున్నదని పేర్కొన్నారు. జిల్లాలోని 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ సువర్ణవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు ఫోన్ 08985007588, 6300429938 నెంబర్లను సంప్రదించాలన్నారు.

జొన్నవాడ ఆలయంలో 'ఎస్‌హెచ్‌ఎస్'

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

మండలంలోని జొన్నవాడ గ్రామంలో పినాకిని నదీ తీరాన వెలసివున్న శ్రీ మల్లికార్జున స్వామి సమేతా కామాక్షితాయి అమ్మవారి దేవాలయంలో స్వభావ్ స్వచ్ఛత - సంస్కార్ స్వచ్ఛత అనే కార్యక్రమం నిర్వహించారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అమ్మవారి దేవాలయంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం మంగళవారం నిర్వహించి మొదటిరోజు గర్భాలయ సన్నిధిలోని గోడలు, అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తుల క్యూలైన్లు, ద్వారములు, పలురకాల పరికరాలు శుభ్రపరచారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -వరికుంటపాడు

వరికుంటపాడులో నూతన స్తంభాల ఏర్పాటుకు సంబంధించి బుధవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ కుద్దుష్ బాషా తెలిపారు. ప్రజలు, అధికారులు సహకరించాలన్నారు.

ఆహార పొట్లాలు అందజేత

ప్రజాశక్తి-బిట్రగుంట : భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో హైదరాబాద్ వాసులు గడ్డం నక్షత్ర జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదరణ కేంద్రంలో పిల్లల కేరింతల మధ్య కేక్ కట్ చేసి బిరియాని, స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. నక్షత్రకు నాయనమ్మ కుందన తాత జి పి సుధాకర్ కెనడాలో ఉన్న బాబాయి ప్రణీత్ పిన్ని దివ్వ తాత జగన్ అమ్మమ్మ ప్రసాద్ భాగ్యలక్ష్మి శుభాకాంక్షలు తెలిపారు. ఆదరణ కేంద్రం డైరక్టర్ డాక్టర్ కట్టిపల్లి సింహాద్రి భవాని దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి-మర్రిపాడు : మండల కేంద్రంలోని పాత కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో డాక్టర్ గోపినాథ్ ఆదేశాల మేరకు ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ జగన్ మాట్లాడుతూ విద్యార్థులు ఎదుగుదల లోపానికి, రక్తహీనతకు లోనవ్వకుండా నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం హెచ్‌ఇఒ కొండారెడ్డి, ఎఎన్ఎం రవణమ్మ, ఆశ సుబ్బమ్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : పట్టణంలోని ప్రభుత్వ దళితవాడ పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను ఎంపిడిఒ డి.ఈశ్వరమ్మ, ఎంఇఒ-2 కోటా శ్రీనివాసులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నులిపురుగులు ఉన్న పిల్లలు పోషకాహార లోపంతో పాటు రక్తహీనతలతో త్వరగా అలసిపోతారన్నారు. శారీరక మానసిక అభివృద్ధిలో మందకోడిగా ఉంటారన్నారు. 1-19 సంవత్సరాలలోపు పిల్లలు ఆల్బెండజోల్ 400 ఎంజి మాత్రలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. హెచ్‌ఎం షేక్.షబ్బీర్, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : పట్టణంలోని మేదరవీధిలోని మంగళవారం మేదర వీధిలోని ఎడబ్ల్యుసి, ఎంపిపి పాఠశాల ఆత్మకూరు అర్బన్ ఎన్‌డిడి ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ఎన్‌డిడి ప్రోగ్రామ్‌లో పిల్లలకు (1-19) వయస్సు ఉన్న వారికి ఆల్బెండజోల్ మాత్రలు వేశారన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు అర్బన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్‌కె.అస్మా, ఐసిడిఎస్ సిడిపిఒ సునీలత, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.సుధాకర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రత్నమ్మ, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : శరీరంలోని ప్రేగుల్లో చేరిన నులిపురుగుల నివారణకు ఒక్క ఆల్బెండజోల్ మాత్రతో చెక్ పెట్టవచ్చని ఒకటి నుండి 14 సంవత్సరాల లోపు పిల్లలు తప్పకుండా ఈ మాత్రలు తీసుకోవాలని మహిళా శిశుసంక్షేమ శాఖ బోగోలు పర్యవేక్షణ అధికారి కోటేశ్వరీ తెలిపారు. బోగోలు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని పిల్లలకు మంగళవారం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ సిబ్బందితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య మిషన్ సర్వే ప్రకారం దేశంలో నురిపురుగుల బారిన పడిన ఒకటి నుండి 14 సంవత్సరాల పిల్లలు 22న కోట్ల మంది ఉన్నారన్నారు. పిల్లలు మట్టిలో ఆడుకొని చేతులు కడగకపోవడం బహిరంగ మల విసర్జన ద్వారా ఇది వ్యాప్తి చెందుతాయని వీటి బారినపడిన పిల్లల్లో రక్తహీనత నీరసం కడుపునొప్పి వంటి లక్షణాలు ఉంటాయన్నారు. నులిపురుగుల నివారణకు ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ ద్వారా పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తుందని ప్రతీబిడ్డ ఈ మందును ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి సోనీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాధయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

ప్రజాశక్తి-వరికుంటపాడు



మండలం లోని జి.కొండారెడ్డి పల్లికి చెందిన రైతు కుమ్మిత మాల్యాద్రి (47) అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మాల్యాద్రి తన నాలుగు ఎకరాలలో వరి వ్యవసాయం చేస్తూ జీవనం సాగి స్తున్నాడు. గత పదేళ్లుగా వరి వ్యవసాయంలో దిగుబడులు సరిగా రాక అప్పుల పోలయ్యారు. చేసిన అప్పులు చెల్లించలేక సెప్టెంబర్ 12న మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు నెల్లూరు తరలించి చికిత్స చేయిస్తుండగా మంగళవారం రాత్రి చనిపోయినట్లుగా తెలి పారు. మృతిడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి కేత వేణుగోపాల్‌రెడ్డి

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం

పలుచోట్ల స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా (స్వచ్ఛత యే సేవా) కార్యక్రమం మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీ సర్పంచులు, ఎంపిటిసిలు, ఇతర ప్రజాప్రతినిధులు స్థానిక నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీలు నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మహిమలూరు గ్రామ పంచాయతీలో విఎన్‌ఆర్ జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ నుండి దేవాలయం ప్రాంతం వరకు ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ అధ్యక్షులు కేత వేణు గోపాల్ రెడ్డి ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్, సర్పంచ్ చంద్ర శేఖర్, ఎంపిటిసి పెంచలరావు, నాయకులు రమణారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు అంకయ్య, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, హెల్త్ సూపర్‌వైజర్ సైదా, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మున్సిపాలిటీలో వార్డులలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ షేక్.ఫజలుల్లా అన్నారు మంగళవారం సాయంత్రం మున్సిపాలిటీ లోని స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం నుండి మున్సిపల్ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ షేక్ సర్దార్, వార్డ్ కౌన్సిలర్ సూరా భాస్కర్ రెడ్డి, మున్సిపల్ ఎఇ ప్రసాద్, మున్సిపాలిటీ వర్కర్లున్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : పట్టణంలోని హైస్కూల్ నుంచి పంచాయతీ బస్టాండ్ వరకు మంగళవారం స్వచ్ఛత హీ సేవా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ డి.ఈశ్వరమ్మ మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీలో ఇవాళ నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణకు మండలస్థాయి కమిటీని ఏర్పాటు చేశామన్నారు.

ప్రజాశక్తి - వరికుంటపాడు : మండల పరిషత్ కార్యాలయం నుండి బస్ స్టాండ్ సెంటర్ వరకు ఎంపిడిఒ మల్లికార్జున ఆధ్వర్యంలో స్వచ్ఛత ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి రావెళ్ల నాగేంద్ర, ముజ్జే లక్ష్మినారాయణ, నాదెళ్ల రాజా, జనసేన కన్వీనర్ నాయబ్ రసూల్, బిజెపి కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, తెల్లగొర్ల వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



కావలిలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కావలి : కావలి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్.శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు, ప్రజలు ప్రజాప్రతినిధులు, ఎన్‌జిఒలు ఉద్యోగస్తులతో "స్వచ్ఛత హీ సేవా" కార్యక్రమంలో భాగంగా 'స్వచ్ఛత పరిశుభ్రత'పై అవగాహన ర్యాలీ, మానవహారం ఏర్పాటు చేశారు. స్వచ్ఛ శపథం గావించి, ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు, లోక్‌సత్తా నాయకులు ఎం.మాలకొండారెడ్డి, ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షులు షేక్.ఖాదర్‌బీ, మానవ హక్కుల నేత మహమ్మద్ అలీం, సార్డ్స్ నిర్వాహకులు బేనోమి, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : స్వభావ్ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛతను అనుసరించి తాము స్వచ్ఛత కోసం కట్టుబడి ఉంటామని ఆర్‌టిసి కార్మికులతో డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛత హీ సేవా పక్షోత్సవాలను ఆర్‌టిసి గ్యారేజీలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు మాట్లాడారు. ఈ సందర్భంగా డిపో అధికారులు, సిబ్బంది గ్యారేజీ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) ఎస్‌కె ఖాజామొహిద్దీన్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి.రవిప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : నగర పంచాయతీలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంపై సిబ్బందికి అవగాహన కల్పించి కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వైద్య, ఆరోగ్య సేవలు, పారిశుధ్య కార్మికులను గుర్తించి పిపిఇ కిట్లు అందిస్తామన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : చుట్టు పక్కలనున్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బోగోలు ఎంపిడిఒ వెంకటసుబ్బారావు పేర్కొన్నారు. బోగోలు మండలంలో స్వచ్ఛత హీ సేవ పారిశుధ్య కార్యక్రమాలలో భాగంగా మంగళవారం విద్యార్థిని, విద్యార్థులు స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులతో సచివాలయ సిబ్బందితో ఎంపిడిఒ వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో బోగోలు పంచాయతీ కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ విస్తరణ అధికారి జహీర్ భాషా, సర్పంచ్ అనిత, మండల టిడిపి అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, మాజీ ఎంపిటిసి చిలకపాటి వెంకటేశ్వర్లు, ఎస్ఎస్ యాదవ్, అరుణమ్మ, కావ్య యువసేన బోగిరి ప్రభాకర్, గోచిపాతల సంజయ్, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.